ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 23 సంచిక : 9 మే 2018

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-02-1986, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు ఉదయం ఒకరు మా ఇంటికి వచ్చారు. ఆయన నాతో ఏమంటున్నారు అంటే కృష్ణభక్తులు అందరూ మా కృష్ణుడిని స్మరించుకోండి మీకు మోక్షం వచ్చేస్తుంది అని చెపుతున్నారు, ఏసుక్రీస్తు ప్రచారం చేసేవాళ్ళందరూ మా క్రీస్తును తెలుసుకోండి మీరు స్వర్గరాజ్యం పొందుతారు అని చెపుతున్నారు, సర్వమతాల సమన్వయ మూర్తి మా మెహర్‌బాబాను స్మరించుకోండి మీకు మోక్షం వస్తుంది అని కొంతమంది చెపుతున్నారు, రమణమహర్షిని స్మరించుకోండి మీకు మోక్షం వచ్చేస్తుంది అని మీరు చెపుతున్నారు, ఇన్ని రకాలుగా చెపుతూ ఉంటే ఎలాగ అంటున్నారు. రమణమహర్షిని స్మరించుకుంటేచాలు, ఇంక మీకు ఏమీ అక్కరలేదు, మీకు మోక్షం వచ్చేస్తుంది అని నేను ఎప్పుడైనా, ఎక్కడైనా చెపుతుంటే మీరు విన్నారా? మీరు చెప్పే దానికి ఏదైనా ప్రమాణం ఉందా అని అడిగాను. నన్ను స్మరించుకోండి మీకు మోక్షం వచ్చేస్తుంది అని రమణమహర్షిగారే ఎప్పుడూ చెప్పలేదు అటువంటిది నేను ఎలా చెపుతాను అని ఆయనతో చెప్పాను. ప్రతీ ఆదివారం ఇక్కడకు వచ్చే భక్తులను మీరు రమణభక్తులు కండి అని నేను ఎప్పుడూ ఎవరితోనూ చెప్పలేదు. ఒకవేళ వారికి రమణమహర్షి గారు అంటే ఇష్టం ఉండి ఆయనను స్మరించుకుంటే వారిని అడ్డుకోవడానికి నేను ఎవడిని అని ఆయనతో చెప్పాను. ఇక్కడ మేము చెప్పే ప్రవచనాలు ఏదో గౌరవం ఆశించిగాని, పబ్లిసిటీ ఆశించిగాని, డబ్బు ఆశించిగాని చెప్పటంలేదు. నేను చెప్పే మాటలను మీరు అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి, అంతే చాలు. అదే మీరు చేయవలసింది.

భగవాన్ చెప్పింది విచారణామార్గం. నేను ఎవడను అని ప్రశ్నించుకొని విచారణ చేసుకోమని చెప్పారు కానీ రమణా, రమణా అంటూ కూర్చోమని ఆయన ఎప్పుడూ చెప్పలేదు. నేను ఎవడినో నాకు తెలియటంలేదు కాబట్టి ఈ శరీరమే నేను అనుకొంటున్నాను, ఈ మనస్సే నేను అనుకొంటున్నాను. నా స్వరూపం ఏమిటో నాకు తెలియటంలేదు అది తెలుసుకోవటానికే ఈ జన్మలోకి వచ్చాను అన్న సంగతి కూడా నాకు తెలియటంలేదు కాబట్టి నేను ఎవడను అనే ప్రశ్న వేసుకోమని చెప్పారు. తన స్వరూపాన్ని తను తెలుసుకోవటానికి ఈ నేను ఎవడను అనే ప్రశ్న సహాయపడుతుంది. స్వామీ మాకు విచారణామార్గం తెలియదు, మీయందు మాకు ప్రీతి ఉంది అందుచేత రమణ రమణ అనుకొంటాము, మిగతా గొడవ మాకు ఏమీ తెలియదు అని భగవాన్ దగ్గర ఎవరైనా భక్తులు అంటే వారి మనస్సు గాయపడకుండా ఉండటంకోసం సరిసరి అనేవారు. అంటే ఆయన పబ్లిసిటీ చేసుకొంటున్నాడు అని అర్థమా? ఆమాత్రం చిన్న విషయం కూడా మనం అర్థం చేసుకోలేకపోతే ఎలాగ? కొంతమంది ప్రకృతిజీవులు ఉంటారు, రంపం పెట్టి కోసేసినా వారికి ప్రకృతివాసన పోదు అని రామకృష్ణుడు చెప్పాడు. జైలుకు వెళ్ళటం అలవాటు అయిన వాళ్ళు జైలు నుండి బయటకు విడిచిపెట్టగానే దొంగతనం చేసి మళ్ళీ జైలుకు ఎలా వెళ్ళిపోతారో అలాగే ఈ ప్రకృతిజీవులకు పుట్టటం, చావటం, తిరిగి పుట్టటం తప్ప ఇంకో పని ఏమీ లేదు. చనిపోతారు తిరిగి పుడతారు అది మంచిజన్మ అవ్వవచ్చు, చెడ్డజన్మ అవ్వవచ్చు అంతేగానీ ఈ ప్రకృతిలోనుండి బయటకు రారు. మన కళ్ళకు కనిపిస్తున్న ఈ పంచభూతాలే ప్రకృతి కాదు, నీ మనస్సు, అహంకారం కూడా ప్రకృతే. మీరు ఏ దేవుడిని పూజించినా, ఏ గురువును ఆశ్రయించినా, ఏ మతంలో ఉన్నా, మీరు ఏ జన్మలో ఉన్నప్పటికీ ఎంతకాలమైతే ఈ మనస్సు ప్రకృతిని దాటలేదో అంతకాలం ఈ జీవుడు ప్రకృతిలోకి వస్తూ ఉండవలసిందే. ఇందులో సందేహం అక్కరలేదు, ఎవరూ మీకు సహాయం చేయలేరు. సెల్ఫ్ అండర్‌స్టాండింగ్ లేకుండా సెల్ఫ్ రియలైజేషన్ ఎవరికీ రాదు. కొంతమందికి సోమరితనం ఉంటుంది. ఏదో ఒక విషయం చెప్పి దాని గురించి కొంత ఆలోచించండి అంటే ఆలోచించటానికి వారు ఇష్టపడరు. ఏమోనండీ ఆ విషయం మాకు తెలియదు అంటారు. ఆలోచన కోసం కొంత ప్రయత్నం చేయాలి. ఆత్మ గురించి మీ బుద్ధికి కొంతవరకు అవగాహన లేకపోతే ఈ జన్మలోనే కాదు ఏ జన్మలో కూడా మీకు ఆత్మజ్ఞానం రానే రాదు. మనం ప్రకృతిని దాటామో లేదో ఎవడి హృదయానికి వాడే సాక్షి. దీనికి ఋజువులు అక్కరలేదు. స్థితప్రజ్ఞుడి లక్షణాలు మీరు ఎదురుగా పెట్టుకోవటం, ఆ లక్షణాలకు సరిపడా నా హృదయం ఉందా లేదా అని చూసుకోవటం. లేదు అనుకోండి మనం ప్రకృతిలోనికి వచ్చేస్తాము. మీరు జంతువుగా

పుట్టవచ్చు, బీదవాడిగా పుట్టవచ్చు, కోటీశ్వరుల ఇంట్లో పుట్టవచ్చు, అది వేరే విషయం, ఎలాగైనా మీరు ప్రకృతిలో బంధింపబడతారు. ఇనుపసంకెళ్ళు అయినా సంకెళ్ళే, బంగారపుసంకెళ్ళు అయినా సంకెళ్ళే. బంగారపుసంకెళ్ళతో నా చేతులు కట్టేస్తారు అనుకోండి. అవ్వటానికి అది బంగారమే. అబ్బ ఎంత బాగుంది, ఎంత బాగుంది అని సంతోషిస్తానా, లేక ఏడుస్తానా? అందుచేత ప్రకృతివాసన ఉన్నవారిని అంటే బద్ధజీవులను ఎవరూ కాపాడలేరు, వారు ఈ ప్రకృతిచక్రంలో అలా తిరుగుతూ ఉండవలసిందే. ఒకవేళ పరాకుపడి మీరు వాళ్ళ వెనకాల వెళితే మిమ్మల్ని కూడా ఆ చక్రంలోనికి లాగుకొనిపోతారు అని రామకృష్ణుడు చెప్పాడు. వివేకం లేకుండా మీరు వెళ్ళి ఆ ప్రమాదంలో పడితే ఆ సుడిగుండంలో కొట్టుకొనిపోతారు.

రామానుజాచార్యులు శ్రీరంగంలో ఉండేవాడు. ఆయన 120 సంవత్సరాలు జీవించాడు. ఆయన ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి రంగనాధుడిని దర్శనం చేసుకొని వచ్చేవాడు. ఇక్కడ విశేషం ఏమి జరిగింది అంటే రంగనాధుడిని దర్శించే వాళ్ళు తగ్గిపోయారు, రామానుజుడి దగ్గరకు వెళ్ళేవారు పెరిగిపోయారు. ఎక్కడైనా డబ్బులో నుంచే పేచీ వస్తుంది కదా! అర్చకస్వాములు ఏమి చేసారు అంటే ఇక్కడకు జనం తక్కువగా వస్తున్నారు, రామానుజుని చూడటానికి ఎక్కువగా వెళుతున్నారు, మనకు వచ్చే ఆదాయం తగ్గిపోతోంది అందుచేత రామానుజుడిని చంపేస్తే మంచిది అనుకొన్నారు. డబ్బు మనిషిని ఎంతదూరం తీసుకొనిపోతుందో చూడండి. అర్చకులకు ఆయన ఏమీ అపకారం చేయలేదు. పైగా రంగనాధుడికి నమస్కారం పెట్టాక, భగవంతుడికి అర్చన చేస్తున్నారని వీరికి కూడా పెట్టేవాడు రామానుజుడు. ఇతనిని చంపటానికి అర్చకస్వాములు నిర్ణయం చేసుకొన్నారు. ఆయన భార్యతో ఏమని చెప్పాడు అంటే "ఆయన వలన మనకు ఆదాయం తగ్గుతోంది అందుచేత రామానుజుడిని చంపాలనే సంకల్పం నాకు వచ్చింది. మీరు భోజనానికి రండి అని ఆయనను పిలుస్తాను. ఆయన భోజనానికి వచ్చినప్పుడు నువ్వు ఏమి చేస్తావు అంటే ఆయనకు పెట్టే అన్నంలో విషం కలుపు" అని చెప్పాడు. దానికేముంది అలాగే చేద్దాము అని భార్య చాలా నేచురల్‌గా అంది. అప్పుడు అర్చకస్వాములు ఒక మాట అన్నారు "నేను ఎన్ని జన్మలు పుణ్యం చేసుకుంటే నీలాంటి భార్యను పెరుమాళ్ళు నాకు ప్రసాదించాడు. ఏమండీ చంపటం మనకు ఎందుకు అని నువ్వు అంటున్నావా? లేదు. నా నోట్లోంచి మాట బయటకు వచ్చింది, నువ్వు అంగీకరించావు. అందుచేత భవిష్యత్తులో ఎన్ని జన్మలు ఎత్తినా నువ్వే నాకు భార్యకింద ఉండాలి" అంటున్నాడు. ఈ మాటకోసం కథ అంతా చెపుతున్నాను. ఇంక వాడిని ఎవడు కాపాడతాడు చెప్పండి. ఏ దేవుడు వాడిని కాపాడలేడు. రామానుజుడిని భోజనానికి పిలిచారు. ప్రశాంతమైన మూర్తి, ఇంద్రియ వాసన లేని మనిషి. భోజనానికి

వచ్చాడు, ప్రశాంతంగా కూర్చున్నాడు. ఆ మొఖం చూసేటప్పటికి ఇంత మహానుభావుడినా మనం చంపేస్తున్నాము అని అర్చకస్వాములకు అనిపించింది. కోపంగానీ, ద్వేషంగానీ, అసూయగానీ ఏమీ ఆ కళ్ళలో కనిపించటంలేదు. ఆ కళ్ళనుండి మహాప్రవాహంలాగ కాంతి వస్తోంది. అర్చకస్వాములకు కలత వచ్చి ప్రక్క వరండాలో తిరుగుతున్నాడు. ఎలాగైనా లోపల భయం ఉంటుంది కదా! అన్నం వడ్డించింది, రామానుజుడు అన్నం కలుపుతున్నాడు. ఆయన మొఖం వంక చూస్తోంది అర్చకస్వామి భార్య. ఇంక కొన్ని క్షణాలలో మరణం ఖాయం అయినా ఎంత ప్రశాంతం అనుకొంది. అలా ఆయనను చూసేటప్పటికి ఆవిడ హృదయంలోనుండి శాంతి పొంగివచ్చి అప్రయత్నంగా ఆవిడ నోటినుండి ఒకమాట జారింది. తన భర్తకు యిచ్చిన మాట మర్చిపోయింది, తన శరీరాన్ని మర్చిపోయింది, ఈ ప్రకృతిని మరిచిపోయింది, ఈ లోకాన్ని మరిచిపోయింది. రామానుజా! నువ్వు తినబోయే అన్నంలో విషం కలపబడింది అంది. అప్పుడు రామానుజుడు ప్రశాంతంగా ఆవిడ మొఖంవంక చూసి అక్కడ నుండి లేచి బయటకు వచ్చి చెయ్యి కడుక్కుని నెమ్మదిగా వెళ్ళిపోయాడు. నువ్వు విషం ఎందుకు పెట్టావు అని ఆవిడను అడగలేదు. ఆవిడమాట విన్నాక నువ్వు నాకు విషం ఎందుకు పెట్టావు అని అర్చకస్వామినీ అడగలేదు. నెమ్మదిగా అక్కడనుండి వెళ్ళిపోయాడు.

శాంతిలేనివాడికి సుఖంలేదు. సుఖం వేరు, భోగం వేరు. మన బుద్ధితో ఆలోచించి నిర్ణయించుకొనే శక్తిని ఏనాడో కోల్పోయాము కాబట్టి శబ్దానికి అర్థం తెలియక మాటని సాంబారు క్రింద తీసేసుకొంటున్నాము. ఇక్కడ భగవంతుడు ఏమని చెపుతున్నాడు అంటే నీకు సుఖం కావాలి అంటే శాంతి కావాలి. శాంతి లేనివాడికి సుఖం లేదు. సర్వసాధారణంగా సామాన్యమానవుడి యొక్క అభిప్రాయం ఏమిటి అంటే ఎంత ఎక్కువ డబ్బు ఉంటే అంత సుఖపడవచ్చు అనుకొంటాడు. ప్రతీవాడికీ సుఖం కావాలి. దేవుడు లేడు అని చెప్పేవాడికి సుఖం కావాలి, దేవుడు ఉన్నాడని చెప్పేవాడికి సుఖం కావాలి. నాకు సుఖం అక్కరలేదు అని చెప్పే మనిషి ఎవరైనా ఉన్నారా? భగవంతుడు ఏమని చెపుతున్నాడు అంటే నీవు సుఖపడాలంటే ముందు శాంతిని సాధించు అంటున్నాడు. ఇక్కడ డబ్బు మాట చెప్పటం లేదు. అయితే డబ్బు యొక్క విలువ కృష్ణుడికి తెలియదా? ఇక్కడ ఒక చిన్న రహస్యం ఉంది. శాంతిలో నుండి సుఖం పుట్టుకొనివస్తుంది. డబ్బులో నుండి భోగం పుట్టుకు వస్తుంది. డబ్బుకు విలువ లేదు అని కాదు డబ్బు వల్ల భోగం వస్తుంది. నీకు సుఖం కావాలా శాంతిని సాధించు నీకు భోగం కావాలా డబ్బు సంపాదించు. పెర్ఫెక్షన్ ఈజ్ వన్ థింగ్ అండ్ ఎంజాయ్‌మెంట్ ఈజ్ అనెదర్. దీజ్ ఆర్ టూ డిఫరెంట్ థింగ్స్. మనం జిన్నూరు నుండి ఒకవైపుకు పోతే నరసాపురం వస్తుంది, రెండో వైపుకు పోతే నిడదవోలు

వస్తుంది. నరసాపురం వెళ్ళే కారు ఎక్కి నిడదవోలు రావటంలేదని బాధపడటం ఎంత మూర్ఖత్వం. అది నిడదవోలు వెళ్ళే కారా? నరసాపురం వెళ్ళే కారా? అని బోర్డు చూడకుండా కారు ఎక్కేయటమేనా? డబ్బు వల్ల భోగం వస్తుంది, శాంతి వల్ల సుఖం వస్తుంది. అయితే మనకు శాంతి ఎలా వస్తుంది? ఆత్మను తెలుసుకోవటానికి చేసే ప్రయత్నం వల్ల శాంతి పుడుతుంది. మీరు ప్రకృతిని పరిశీలిస్తూ ఉంటే అశాంతి పుడుతుంది. ఎందుచేతనంటే అందులో ఉన్నది అశాంతే కాబట్టి. మీరు ఎన్ని భోగాలు అనుభవించినప్పటికీ, ఎన్ని జన్మలు ఎత్తినా మీకు యింద్రియ నిగ్రహం కనుక లేకపోతే ఆత్మలో నుండే శాంతి వస్తుంది అనే తలంపు కూడా మీకు రాదు అని పరమాత్మ చెపుతున్నాడు.

ఇక్కడ భగవాన్ ఒక చక్కటి మాట చెప్పారు. నీకు జగత్తు కనిపిస్తున్నంతకాలం ఆత్మదర్శనం అవ్వదు. ఆత్మదర్శనం అయినవాడికి జగత్తులేదు. మనం భోగాలను కోరుకొంటున్నాము. భోగాలు అనుభవించటం వలన సుఖం వస్తుందని మనం భోగాలను కోరుకొంటున్నాము. భగవంతుడు ఏమని చెపుతున్నాడు అంటే భోగంలో సుఖం లేదు. మన హృదయంలో ఉన్న ఆత్మయందే నిజమైన సుఖం ఉంది. అక్కడే భగవంతుడు ఆత్మ రూపంలో ఉన్నాడు. ఈ లోకం లేనప్పుడు, ఈ జీవకోటి లేనప్పుడు కూడా ఆత్మ ప్రకాశిస్తోంది. ఈ దేహమే కనుక నిజమైతే అది ఎప్పుడూ ఎందుకు ఉండటం లేదు. ఒకప్పుడు ఉండి, ఒకప్పుడు లేనిది నిజం ఎలా అవుతుంది? పంచదార లేని కాఫీ, పంచదార లేని టీ ఎలా ఉంటాయో మన దైనందిన జీవితంలో ప్రేమ లేకుండా చేసే పనులు అలాగే ఉంటాయి. మీరు ఏపని చేసినా ప్రేమ భావనతో చెయ్యండి. అప్పుడు జ్ఞానం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. మీరు నిజమైన భక్తులు అయితే, మీరు చేసే పనులు ప్రేమగా చేస్తూ ఉంటే ఎప్పుడు లోపలకు రమ్మంటారు అని జ్ఞానం వచ్చి మీ గుమ్మం దగ్గర ఎదురుచూస్తుంది. ఎందుచేతనంటే దేవుని అడ్రస్ మనకు తెలియదు కానీ మన అడ్రసు దేవుడికి తెలుసు. అందుచేత మనకోసం ఆయనే వస్తాడు. దీనికి ఒకటే ఉపాయం. మీరు దైనందిన జీవితంలో మామూలుగా మీరు చేస్తున్న పనులే ప్రేమ భావనతో చెయ్యండి, మీకు జ్ఞానం వస్తుంది. ఇతరులతో మాట్లాడేటప్పుడు సాధ్యమైనంతవరకు చేదు మాటలు ప్రయోగించకుండా, తియ్యటి మాటలు ప్రయోగించండి. మాటలవల్ల విరోధాలు వస్తాయి, అవి మనస్సును పాడుచేస్తాయి. మీరు ఎదుటి వ్యక్తులతో మాట్లాడేటప్పుడు మీరు సత్యమే చెపుతున్నప్పటికీ అది ప్రీతిగా చెప్పాలి, ఎదుటివారి ఫీలింగ్ హర్ట్ అవ్వకుండా చెప్పాలి, వారికి అర్థమయ్యేలాగ చెప్పాలి. మనం తినే వస్తువులు తియ్యగా ఉండాలి. కూర చేదుగా ఉంటే కంచం గోడ అవతలకి విసిరేస్తాము. మన లోపలకు వెళ్ళే వస్తువులు తియ్యగా ఉండాలి, లోపల నుండి బయటకు వచ్చే మాటలు

చేదుగా ఉన్నా ఫరవాలేదు. ఇది మీ అనుభవంలో ఉందా? లేక నేను కల్పించి చెపుతున్నానా? మీకు అనుభవంలో లేని విషయం, ఏది మీకు విరుద్ధంగా నేను చెపుతూ ఉంటే, రీజన్‌కు దూరంగా చెపుతూ ఉంటే ఆ మాటలు నేను చెప్పినా, ఎవరు చెప్పినాగానీ వాటిని మూటగట్టి ఒక ప్రక్కన పెట్టేయండి. ఒక్క జ్ఞానికి మాత్రమే కర్మతో పని ఉండదు. మనం దైనందిన జీవితంలో కర్మ చెయ్యాలి కదా! పని చెయ్యకుండా దేహయాత్ర సాగదు. అందువలన మీరు చేసే పనే ప్రేమభావనతో చెయ్యండి, మీకు జ్ఞానం కలుగుతుంది. మనం చేసే ప్రతీ పని అహంకారంతో చేస్తాము. మనం దానం చేసినా, ఏ పని చేసినా మనకు తెలియకుండా అక్కడ ఎంతోకొంత అహంకార వాసన ఉంటుంది, నేను చేస్తున్నాను అనే భావన ఉంటుంది. అలా కర్తృత్వ భావన పెట్టుకొని మీరు చేసే పనికి, మీరు మాట్లాడే ప్రతీ మాటకు, మీ మనస్సులో వచ్చే ప్రతీ తలంపుకు ఈ జన్మలో కాకపోయినా, కోటి జన్మల తరువాత అయినా మీరు సమాధానం చెప్పవలసిందే. కృష్ణుడు కొన్నివేల మందిని చంపాడు అయినా ఆయనకు పాపం రాదు ఎందుచేతనంటే అక్కడ కర్తృత్వ బుద్ధిలేదు. మనం ఏ పని చేసినా కర్తృత్వ బుద్ధితో చేస్తాము. మనం కర్తృత్వ బుద్ధి పెట్టుకొని ఒక మాట మాట్లాడినా, ఏదైనా ఒక పని చేసినా దానికి ఎప్పటికైనా మంచికి మంచి, చెడ్డకు చెడ్డ నేను అనుభవించవలసిందే, ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. దేవుడికి నమస్కారం పెట్టే వారందరూ భక్తులు అనుకోవద్దు, గుడికి వెళ్ళే వారందరినీ మీరు భక్తులుగా జమకట్టవద్దు. గుడికి వెళ్ళే వారందరూ నిజంగా భక్తులు అయితే ఈ పాటికి వాళ్ళందరికీ మోక్షం వచ్చేయాలి కదా!

నేను చాలా ఆలోచించి ఒక విషయం కనిపెట్టాను అని ఈమధ్య ఒక భక్తుడు నాతో చెప్పాడు. “మనం ఎప్పడైనా దేవుడికి కొబ్బరికాయ కొట్టాలంటే గుడికివెళ్ళి కొబ్బరికాయ కొట్టేబదులు మన ఇంట్లో ఉన్న దేవుడి దగ్గర కొబ్బరికాయ కొట్టటం మంచిది. దేవుడు ఎక్కడైనా దేవుడే కదా! గుడిలో కనుక కొబ్బరికాయ కొడితే ఒక చెక్కే మనకు వస్తుంది. మన ఇంట్లో ఉన్న దేవుడి దగ్గర కొబ్బరికాయ కొట్టేసుకుంటే రెండు చెక్కలూ మనమే పచ్చడి చేసుకోవచ్చు. అందుచేత భక్తులు ఇలా జీవించాలి” అని సలహా చెప్పాడు. వీడూ భక్తుడే. ఇంటి దగ్గర కొబ్బరికాయ కొట్టిన మాట నిజమే అయితే వాడికి మోక్షం వస్తుందా? మనకు ఎప్పడైనా ఈ విషయం తట్టిందా? మోసం చేయటానికి కూడా ఎంతోకొంత తెలివైన వాళ్ళు తప్ప మోసం చేయలేరు. అందుచేత కనిపించిన వాళ్ళందరూ భక్తులు అని అనుకోవద్దు. జ్ఞాని కానివాడి పుస్తకాలు చదవటం వలన ఎంత నష్టమో, జ్ఞాని అయినవాడి పుస్తకాలు చదవటం వలన అంత లాభం వస్తుంది. మీరు విషయాన్ని అర్థం చేసుకోండి. మీరు చేసే పనికి నాకు చేతనైనంతవరకు సహకరించగలను కానీ నేను మిమ్మల్ని ఉద్ధరించలేను.

మీ తల్లితండ్రులు కూడా మిమ్మల్ని ఉద్ధరించలేరు. మీ మనస్సు కనుక బాగుపడితే, మీ మనస్సు పవిత్రం అయితే అదే మిమ్మల్ని ఉద్ధరిస్తుంది. ఈరోజు మీరు భక్తిగా ఉండవచ్చు. రేపటికి భక్తి తగ్గిపోవచ్చు. ఈ ఆటుపోట్లు మనకి వస్తున్నాయి కదా! దీనికి కారణం మనకు తెలియకపోవచ్చు కానీ ఇది మన అనుభవంలో ఉంది కదా! ఒకరోజున దేవుడు ఉన్నాడని పిస్తుంది. ఒకరోజున దేవుడు లేడు, ఏమీ లేదు, ఇది అంతా కల్పితం అనిపిస్తుంది. ఏ కారణం వలన మనకు ఈ వికారం పుడుతోంది. ఇంద్రియనిగ్రహం మనకు లేకపోవటం వలన ఇలా జరుగుతోంది. ఇంద్రియాల వలననే ఈ హెచ్చుతగ్గులు వస్తున్నాయి అన్న సంగతి ముందు మనకు తెలియాలి. ఇంద్రియనిగ్రహం గురించి పరమాత్మ గీతలో విపులంగా చెప్పాడు. ఇంద్రియాల విషయంలో జాగ్రత్త, వాటిని నమ్మవద్దు, నిన్ను ఎప్పుడోకప్పుడు ప్రమాదంలోనికి గెంటేస్తాయి. నేను ఇంద్రియాలను జయించాను, ఆవలి ఒడ్డుకు చేరుకొన్నాను, తరించాను అనుకోవద్దు. ఎంతకాలం అయితే నీ శరీరం ఈ భూమి మీద తిరుగాడుతుందో, ఎంతకాలం అయితే నీ శరీరంలో ప్రాణం కొట్టుకొంటోందో అంత వరకు ఇంద్రియాలను నమ్మవద్దు, వీటి విషయంలో బహుజాగ్రత్తగా ఉండు అని పరమాత్మ చెపుతున్నాడు.

మీకు ఒక చిన్న చిట్కా చెపుతున్నాను. పెద్ద కష్టం వద్దు, మీరు చేసే ప్రతీ పనీ మామూలుగా లోకప్రీతికోసం చేస్తున్నారు. అదే ఈశ్వరప్రీతికోసం చేయండి సరిపోతుంది. మీకు జ్ఞానం ఇచ్చేది లోకం కాదు, జ్ఞానం ఇచ్చేది ఈశ్వరుడు. మీరు లోకం ఒడిలో తలదాచు కోవటం కాదు, ఈశ్వరుని ఒడిలో తలదాచుకోండి. మీరు రోజూ చేసే పనులే ఈశ్వరుని సంతోషం కోసం చెయ్యండి. ఈశ్వరునికి సంతోషం కలిగించే పనులు కనుక మీరు చేస్తూ ఉంటే ఈశ్వరుడు పరమానందం పొంది ఆయన స్వరూపాన్ని తెలుసుకునే బుద్ధిని మీకు ప్రసాదిస్తాడు. అంతవరకు మనకు జ్ఞానంరాదు. అందుచేత మీరు చేసేపని నిర్మలంగా చెయ్యండి, గౌరవాలకోసం గొప్పలకోసం చేయకండి. మీ శక్తికి మించిన పనులు చెయ్యమని నేను చెప్పటంలేదు. మీకు అనుకూలంగా ఉన్న పనులే, మీరు చేయగలిగే పనులే సింపుల్‌గా చెయ్యండి, కేవలం ఈశ్వర ప్రీతికోసమే చెయ్యండి. అప్పుడు మీకు ఈశ్వరానుగ్రహం వస్తుంది. మానవుడికి తన ప్రాణం అంటే పరమప్రీతి. నీకు పరమప్రీతి అయిన నీ ప్రాణానికి నువ్వు ఎంత విలువ ఇస్తున్నావో అంతకంటే ఎక్కువ సత్పురుషుల సహవాసానికి నువ్వు విలువ ఇయ్యి. నువ్వు సత్పురుషుల సహవాసానికి అంత విలువ ఇస్తే నీ బ్రతుకు బాగుపడుతుంది అని ఆచార్యుల వారు చెపుతున్నారు. ఆచార్యులవారు మన క్షేమంకోరి దేశం అంతా చెప్పులు లేకుండా పర్యటిస్తూ మన మీద ఎంత అనురాగం ఉంటే ఈ మాటలు చెప్పాడు. మేము సాధన చేస్తున్నాము, చాలా ప్రయత్నం చేస్తున్నాము అయినా ఏమీ అభివృద్ధి కనబడటం లేదు, గమ్యం కనబడటం

లేదు అని చాలామంది సాధకులు అంటూ ఉంటారు. దీనికి వైరాగ్యం లేకపోవటం, ఇంద్రియ నిగ్రహం లేకపోవటం కారణం. వైరాగ్యం లేనివాడికి, ఇంద్రియనిగ్రహం లేనివాడికి జ్ఞానం కలుగదు. ఏదో కొంచెం మిణుకు, మిణుకుమని మెరిసినట్లుగా ఏమైనా కాస్త మీ బుద్ధికి అందినప్పటికీ అది నిలబడదు అని భగవంతుడు చెపుతున్నాడు.

నువ్వు ఎంత కీర్తి సంపాదించినా, ఎంత డబ్బు సంపాదించినా అవి నీ శరీరంతోటి సమానమే అంటున్నారు ఆచార్యులవారు. ఏం ఇమ్మోర్టల్ వర్డ్స్ అండి. మీకు ఎలా ఉందో నాకు తెలియదు కానీ నాకు మాత్రం అమృతం తాగినట్లుగా ఉంది. నువ్వు ఎంత గొప్ప కీర్తి సంపాదించినా, నా అంత గొప్పవాడు కాని నాతో సమానమైన వాడు కాని ఈ సమాజంలో లేడు అని కీర్తి కిరీటం నువ్వు అలంకరింప చేసుకొన్నప్పటికీ నీ దేహం ఎంత అశాశ్వతమో, నువ్వు సంపాదించుకొన్న ఈ కీర్తి కూడా, ఈ ధనం కూడా అంతే అశాశ్వతం, అవి నీ దేహంతో సమానమే అంటున్నారు. ఎక్కడ నుండి చెపుతున్నాడో ఈ మాటలు, ప్రకృతి మనిషి ఈ మాటలు చెప్పగలడా? మనమీద ఎంత ఆప్యాయత లేకపోతే మెంటల్ రిజర్వేషన్స్ లేకుండా తన మనస్సునీ, తన శరీరాన్నీ, తన శక్తినీ, తన తెలివిని అంతా మనకోసం ఖర్చు పెట్టాడు అంటే ఎవడు ఖర్చుపెట్టగలడు? ఆయన భగవంతుడి యొక్క అవతారం కాకపోతే మరి ఏమిటి? మనకు చిన్న మంచిమాట చెప్పేవాళ్ళు ఈ సమాజంలో ఎంతమంది ఉన్నారు. ఒకవేళ మనకు మంచిమాట చెపితే మనం ఎక్కడ బాగుపడిపోతామో అని ఆ మంచిమాట మనకు కూడా తెలియనివ్వకూడదు అనే ప్రబుద్ధులు ఎక్కువమంది ఉన్నారు. అటువంటి వారికా జ్ఞానం కలిగేది. వివేకానందుడు చాలా గొప్పవాడని మనం అనుకొంటున్నాము. ఏమయ్యా మన వివేకానందుడు ఎవరితో స్నేహాలు చేస్తున్నాడు అని రామకృష్ణుడు ఆయనమీద నిఘా పెట్టేవారు. దానిని బట్టి స్నేహాల యొక్క ప్రభావం మనిషి యొక్క బ్రెయిన్ మీద ఎంత ఉంటుందో చూడండి. ఇంగ్లండ్‌లో ఒక సామెత ఉంది. నువ్వు ఎటువంటివాడివో మాకు చెప్పకు, నీ స్నేహితుల పేర్లు నాలుగు చెప్పు, నీ గురించి నేను అంచనా కట్టుకొంటాను అని. అంటే స్నేహాల విషయంలో మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో చూడండి. ఇక్కడ భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నిన్ను పాడుచేయటానికి ఒక చిన్న దోషం చాలు. ఒక చిన్న నలుసు కంటిలో పడింది అనుకోండి ఇంక వస్తువులను సరిగా చూడనివ్వదు. కన్ను ఎంత పెద్దది, నలుసు ఎంత చిన్నది. ఇంత చిన్న నలుసు కూడా పెద్ద కంటిని డిస్టర్బ్ చేసేస్తుంది. అదేవిధంగా మనం ఎంతోసాధన చేస్తున్నాము అనుకొంటున్నప్పటికీ, మనం ఎంతో పెద్దవాళ్ళము అయిపోయాము అనుకొంటున్నప్పటికీ మనలో ఒక చిన్న దోషం ఉంటేచాలు అది మనలను పతనం చేసేస్తుంది. ఒక చిన్న

నలుసు కంటిలో పడితే, ఆ నలుసును తీసేవరకు నీ కన్ను ఎలాగైతే చూడలేదో అలాగే నీ మనస్సులో ఎన్నో దోషాలు ఉండనక్కరలేదు, ఒక చిన్న దోషం మిగిలి ఉన్నా, ఆ చిన్న దోషం కూడా నువ్వు శాంతి సామ్రాజ్యంలో, మోక్ష సామ్రాజ్యంలో ప్రవేశించకుండా అది అడ్డుకొంటుంది. ఆ దోషం నేను జయించాను అని నువ్వు అనుకొన్నప్పటికీ మరణ సమయంలో ఆ దోషం బయటకు వచ్చి నా మాట ఏమిటి అంటుంది? నేను నిన్ను చూడలేదు, నువ్వు నాలో లేవు అనటానికి అవకాశం లేదు. ఆ చిన్న దోషం ఎన్ని నీచజన్మలకు కారణం అవుతుందో చెప్పలేము. ఒక చిన్న దోషమే ఇంత పతనం చేయటానికి అవకాశం ఉన్నప్పడు ఎన్నో దోషాలు ఉన్న మనిషి గురించి ఇంక మనం చెప్పకోనక్కరలేదు అంటున్నాడు పరమాత్మ.

మీ ఇల్లు బాగాలేదు అనుకోండి, ఇంటి గురించి ఆలోచన. మీ శరీరం బాగాలేదు అనుకోండి, శరీరం గురించి ఆలోచన. నీ ఇంటి మీద ఉన్న ప్రీతి, నీ దేహం మీద ఉన్న ప్రీతి తప్పు అని నేను అనటం లేదు. ఇదే వేదన, ఇదే ఆకాంక్ష మీ మనస్సును బాగుచేసుకోవాలి అనే ప్రయత్నంలో ఎందుకు రావటం లేదు, అక్కడ మీరు ఎందుకు ఫెయిల్ అవుతున్నారు మనస్సు అనేది ఒకటి ఉంది కదా! దేవుడు కనబడటం లేదు కానీ మీ మనస్సు మీకు తెలుస్తోంది కదా! సంవత్సరానికి ఒకసారి మీరు ఇల్లు బాగుచేయించుకొంటున్నారు. శరీరానికి ఏదైనా రోగం వస్తే వైద్యం చేయించుకొని ఆ రోగాన్ని పోగొట్టుకొంటున్నారు. మీ శరీరం పట్ల, మీ ఇంటిపట్ల ఉన్న ఇదే ప్రయత్నం మీ మనస్సును సరిచేసుకోవటంలో, మీ మనస్సులో ఉన్న వంకరలు తీసేసుకోవటంలో ఎందుకు మీరు చేయటంలేదు. మీ దేహం యొక్క ఆరోగ్యం ఏవిధంగా అయితే కోరుకొంటున్నారో అలాగే మీ మనస్సు కూడా ఆరోగ్యంగా ఉండాలి కదా! మానసిక ఆరోగ్యం ముఖ్యం, ఆరోగ్యమైన మనస్సుకి కాని ఈశ్వరుడు అందడు కదా! అందుచేత మానసిక ఆరోగ్యం కోసం మనం ప్రయత్నం చేయాలి. మీ హృదయం యొక్క లోయలలో నుండి సబ్జక్టు పట్ల ప్రీతి ఉబికి, ఉబికి రావాలి. అది కేవలం మేము చెప్పే మాటల వలన మీకు రాదు. సబ్జక్టు పట్ల కాంక్ష మీ హృదయం యొక్క లోతులలో నుండి పుట్టుకురావాలి. సోదరమహాశయులారా! భగవంతుడు వేరు, భగవంతుడు చెప్పిన మాట వేరు కాదు. కృష్ణుడు ఇప్పుడు లేడు అని మీరు అనుకోవద్దు. ఈ మాటల రూపంలో ఉన్నాడు. ఈ మాటయందు మీకు గౌరవం ఉంటే కృష్ణుడియందు గౌరవం ఉన్నట్లే. ఆయన చెప్పిన మాటకు, కృష్ణుడికి బేధం చూడటం అపచారం. త్యాగరాజు పాటలు పాడాడు కాబట్టి బజారులో పాటలు పాడే వాళ్ళందరూ సెయింట్స్ కాదు. రమణమహర్షి గోచీ పెట్టుకొన్నాడు కాబట్టి గోచీ పెట్టుకొన్నవాళ్ళందరూ రీలైజ్డ్ సోల్స్ కాదు. ఎవడో బట్టతల ఉన్నవాడికి తెలివి తేటలు ఉన్నాయి అని బట్టతల ఉన్న వాళ్ళందరూ తెలివైన వాళ్ళు కాదు. భగవాన్ కూడా

ఫిలాసఫరే కానీ ఆయన సెల్ఫ్ రీలైజ్డ్ ఫిలాసఫర్. త్యాగరాజు కూడా సింగరే కానీ ఆయన సెయింట్ సింగర్. త్యాగరాజుది బజారు సంగీతం కాదు. ఆయన రాముడికోసం పాడాడు.

మనలో విషయచింతన ఉన్నంతకాలం ఆత్మచింతన ఉండదు. మీకు నిజంగా కనుక ఆత్మచింతన ఉంటే విషయచింతన రానే రాదు. మీకు విషయ స్మరణ ఉంటే, ఇంద్రియ భోగాలు మీకు తోస్తూ ఉంటే మీకు ఆత్మచింతన లేనట్లే. నిజంగా మీ బుద్ధి ఆత్మచింతనకు అలవాటుపడింది అనుకోండి పచ్చగడ్డి తిన్న దూడకు ఎదురుగా వట్టిగడ్డి పెడితే అది తింటుందా? అలాగే మీ మనస్సుకు ఆత్మ యొక్క రుచి దొరికితే, ఆ సుఖం కనుక మీకు అందితే ఇంక విషయ సుఖాలు మీకు స్ఫురణకే రావు. విషయాలు మీకు తోస్తున్నాయి అనుకోండి, విషయాలు మీకు గుర్తుకు వస్తున్నాయి అనుకోండి ఇంక మీకు ఆత్మచింతన లేనట్లే. మీరు ఏదో విషయాన్ని ధ్యానిస్తున్నారు కదా అలాగే భగవంతుడు చెప్పిన మాటలను ఎందుకు ధ్యానం చెయ్యరు? స్మరణ లేకుండా మీరు లేరు కదా! భగవంతుడిని ఎందుకు స్మరించరు? ఆయనను ఎందుకు ధ్యానించరు? భగవంతుడు లేడు, ఆత్మలేదు, స్మశానంతో అంతా అయిపోతుంది, తరువాత జన్మ ఇవి అన్నీ అబద్ధం అని చెపుతున్నారు కదా! ఏదో బతికి ఉండగా ఆవకాయ అన్నం అవీ తినేసి, మామిడిపండులో ఉన్న రసం, ఆ టెంక శుభ్రంగా అరిగిపోయేలాగ నాకి నాకి విడిచిపెట్టటం, అలా ఈ ప్రపంచంలో ఉన్న భోగాలను నాకి నాకి చావవయ్యా, ఈ భగవద్గీత ఎందుకు? ఈ పిచ్చి మాటలు ఎందుకు? అని చెప్పే పెద్ద మనుషులు ఈ లోకంలో లేకపోలేదు. వాళ్ళ మాటలు విని మీరు మాయలో పడవద్దు. వాళ్ళు మన దగ్గర చెప్పినట్లే ఆ అలవాటు ప్రకారం మరణానంతరం కూడా ఇలాగే చెపుతాడు. అప్పుడు ఈశ్వరుడు ఏమంటాడు అంటే నువ్వు ఎవడివో నాకు తెలియదు, బయటకు పో అంటాడు.

ఆకలి కూడా ఒక రోగం అని ఆచార్యులవారు చెప్పారు. నీకు రోగం వచ్చినప్పుడు డాక్టరు ఒక బిళ్ళ వేసుకోమంటే ఒక్కటే వేసుకొంటావు కానీ పది బిళ్ళలు మింగవు కదా! అదేవిధంగా నీ శరీరానికి రోగాలు ఎలా వస్తాయో ఈ ఆకలి అనేది ఒక రోగం, ఆ రోగానికి సరిపడ అన్నం తిను. నీకు విపరీతమైన ఆకలి పుట్టినప్పుడు నీ మనస్సు అన్నం కోసం ఎలా ఎదురుచూస్తుందో అంత ఇంటెన్సిటీతో ఈశ్వరుడికోసం మన మనస్సు చూస్తే ఈ దేహంలో ఉండగానే నీకు మోక్షం వస్తుంది అని ఆచార్యులవారు చెపుతున్నారు. మా మనస్సు కుదురుగా ఉండటంలేదు, మా మనస్సు చలిస్తోంది అని చాలామంది అంటూ ఉంటారు. మీ మనస్సులో దోషం ఉంది కాబట్టి అది చలిస్తోంది, మీ మనస్సులో దోషం లేకపోతే అది చలించదు. మనస్సులో దోషం లేనివాడికి ధ్యానంతో పని ఏముంది? దేహమే ఆత్మ, దేహం పుట్టినప్పుడే

నేను పుట్టాను, దేహం మరణించినప్పుడు నేను మరణిస్తాను, ఈ దేహమే నేను, ఇదే నిజం అనుకొనేవాడికి ఈ జన్మలోనే కాదు, ఏ జన్మలోను జ్ఞానం రాదు. దేహాత్మబుద్ధి ఉన్నంతవరకు వాడికి జ్ఞానం రాదు. ఆత్మబుద్ధి ఉన్నవాడికి జ్ఞానం వస్తుంది. కామాన్ని ఎలా జయించాలి అని రమణమహర్షి గారిని ఒక భక్తుడు అడుగుతున్నాడు. దీనికి రమణమహర్షిగారు పెద్ద ఉపన్యాసంలాగ చెప్పలేదు. నీకు దేహభావన ఉన్నంత కాలం నువ్వు కామాన్ని జయించలేవు. ఈ జన్మలోనే కాదు మరుజన్మలో అయినాసరే ఈ లోకంలోనే కాదు పరలోకంలో అయినాసరే నీలో దేహభావన ఉన్నంతకాలం అంటే నీ అస్థిత్వం దేహానికే పరిమితమై ఉన్నంతకాలం నువ్వు కామాన్ని జయించలేవు అని చెప్పారు.

మనం ఇప్పడు దేహబుద్ధి అనే జైలులో ఉన్నాము, ద్వైతబుద్ధి అనే జైలులో ఉన్నాము. ఈ దేహబుద్ధి అనే జైలు నుండి ఎప్పడైతే బయటపడతామో అదే మనకు కడసారి జన్మ. అప్పటివరకు మీ డబ్బుకాని, మీకు ఉన్న కీర్తికాని, మీ గౌరవంకాని, మీ బంధువులుకాని, మీ స్నేహితులుకాని, మీ కళ్ళకు కనిపిస్తున్న ఈ సమాజంకాని ఎవరూ మీకు సహాయం చేయలేరు. నువ్వు ఎంతోకొంత అభివృద్ధిలోనికి వస్తూ ఉంటే నిన్ను చూసి రాళ్ళుపెట్టి కొట్టే ఈ సమాజమా నీకు ఉపకారం చేసేది? ఏ మహాత్ముడిని ఈ సమాజం గౌరవించింది. రమణమహర్షి గారిమీద ఉమ్ములు వేసారు, ఏసుక్రీస్తును శిలువ వేసారు, సోక్రటీసుకు విషం పెట్టి చంపారు. ఏ మహాత్ముడినీ, ఏ సెయింట్‌నీ ఈ సమాజం సరిగా గుర్తించలేదు. అసలు గుర్తించటం దానికి చేతనైతే కదా! కారు వెళుతూ ఉంటే దాని వెనకాల ఎంతోకొంత దుమ్ము లేస్తుంది. నువ్వు ఎంత మంచిపని చేస్తున్నా నిన్ను విమర్శించేవాళ్ళు ఎప్పడూ ఉంటూనే ఉంటారు. అంటే ఎంతోకొంత దుమ్ము లేస్తుంది. నువ్వు అటు చూడకు. ఎవరో విమర్శిస్తున్నారని మీరు కంగారుపడితే, మరణానంతరం ఆ విమర్శించేవారు మీకు సహాయం చేస్తారా? వారి వైపు చూడటం మనదే తప్పు. మనం ఎండలో ఉంటే, అబ్బాయి నువ్వు ఎండలో ఉన్నావు కొంచెం నీడకు వచ్చి కూర్చో అని అంటే వాడు ఎక్కడ సుఖపడతాడో అనుకునే మనుషులా నిన్ను ఉద్ధరించేది, అంత ఇరుకు మనసు ఉన్న మనుషులా నీకు సహాయం చేసేది? వీళ్ళా సమాజాన్ని ఉద్ధరించేది? అటువంటి మనుషుల దగ్గర నుండి మనం ఏదో ఆశించటం మనదే పొరపాటు. అసలు కష్టం, సుఖం లేకపోతే ఈ దేహం ఎందుకు వచ్చింది? ప్రారబ్ధం అనుభవించటానికే ఈ దేహం భూమి మీదకు వచ్చింది. ఆ ప్రారబ్ధం ఖర్చు అయిన మరుక్షణం దేహం మరణిస్తుంది. దేహప్రారబ్ధం ఖర్చు అయిపోయిన తరువాత ఒక్క క్షణం ఆ దేహాన్ని ఉంచమని మనం ఈశ్వరుడిని అడిగినా ఆయన అంగీకరించడు.

భగవంతుడు రెండే రెండుసార్లు నవ్వుకుంటాడు అని రామకృష్ణుడు చెప్పారు.

అందులో ఒకటి ఏమిటి అంటే మనం ఎవరైనా రోగం వచ్చి డాక్టరు దగ్గరకు వెళ్లినప్పుడు వీడిని బతికించే బాధ్యత నాది అని డాక్టరు చెప్పే మాటలు చూసి వీడెవడు అని అప్పుడు కొంచెం నవ్వుకుంటాడట. రెండవది ఏమిటంటే ఏదో గోడకోసం, ఏదో చెట్టుకోసం అన్నదమ్ములు దెబ్బలాడుకొని సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు భగవంతుడికి నవ్వు వస్తుందట. అన్నదమ్ములు అంటే ఒక తల్లి సంతానమే కదా! అన్నగారు తమ్ముడు, తమ్ముడు అంటాడు. తమ్ముడు అన్నయ్య, అన్నయ్య అంటాడు. ఇవి అన్నీ అహంకారం యొక్క చేష్టలే. ఇంత అనురాగం, స్నేహం పంచుకొన్నాక కూడా ఏవో ఆస్థులు పంచుకొనేటప్పుడు ఏదో చిన్న గోడ దగ్గర పేచీ వస్తే మాటలు పెంచేసుకొని హైకోర్టుకు తరువాత సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు మటుకు ఇది ఎంత నిజమైన ప్రేమ అని భగవంతుడికి అప్పుడు ఒక చిన్న నవ్వు వస్తుందట. సోదరమహాశయులారా! ఇప్పుడు మనకు ఉన్న నాలెడ్జ్ అంతా ఫాల్స్ నాలెడ్జ్, ఎక్వర్డ్ నాలెడ్జ్. దీనినే మనం రియల్ నాలెడ్జ్ అనుకొంటున్నాము. అందుచేతనే మనం పతనమవుతున్నాము. మనకు రియల్ నాలెడ్జ్ ఉదయించింది అంటే ఆ సెకనులో మెరుపులాగ జ్ఞానం ఉదయిస్తుంది.

కొంతమంది మనుషుల యొక్క అహంకారం ఎంత దూరం వెళ్లిపోతుంది అంటే ఈ రోజు మనం మరణిస్తే రేపు సూర్యుడు ఉదయించడేమో అనుకొంటారు. వాడు ఎంత అహంకారం యొక్క సింహాసనం మీద కూర్చున్నాడో చూడండి, ఎంత పరాకాష్టకి వెళు తుందో చూడండి. అందుచేత మీరు వినయాన్ని విడిచిపెట్టకుండా, మీరు డబ్బు సంపాదించుకొనేటప్పుడు, మీకు ఇష్టమైన వస్తువును సేకరించుకొనేటప్పుడు ఎంత శ్రద్ధను చూపిస్తున్నారో అంతే శ్రద్ధను మీ మనస్సు, యింద్రియాలను కంట్రోలు చేసుకోవటానికి చూపిస్తూ దానికోసం మీరు తపన పడుతూ ఉంటే ఈశ్వరుడు మీకు సహాయం చేస్తాడు. మీరు చేసే ప్రయత్నాన్ని ఈశ్వరుడు చూస్తాడు, మీకు సహకరిస్తాడు. మీరు ఏమీ కోరుకోనక్కరలేదు. ఈశ్వరుడికి కళ్ళతోటి పనిలేదు, మీరు పెట్టుకొనే పిటిషన్స్‌తో పనిలేదు. ఆయన సర్వసాక్షి.

ఈరోజుకి ఒక చివరిమాట చెపుతున్నాను, ఒక ఫైనల్ వర్డ్ చెపుతున్నాను. మీకు ఇష్టం లేకపోతే ఇప్పటివరకు నేను చెప్పిన మాటలు నాకు ఇచ్చేసి మీరు ఇంటికి వెళ్లిపోండి. కానీ మిమ్మల్ని సగౌరవంగా, సవినయంగా ప్రార్థించేది ఏమిటి అంటే ఇప్పుడు నేను చెప్పే ఈ చిన్నమాటను మాత్రం మీరు గుర్తుంచుకోండి. మీరు ఒక చీర కొనుక్కోవటానికి బజారుకు వెళ్ళారు అనుకోండి. ఆ షాపులో ఫిక్స్‌డ్ ప్రైస్, నో బార్గెయిన్ అని ఉంది అనుకోండి మీకు నచ్చిన చీర వాడు 175 రూపాయలు అని చెపితే మీరు 175 రూపాయలు చెల్లించి ఆ చీరను తీసుకోవాలి. కానీ మాట వరసకి మీ దగ్గర 170 రూపాయలు ఉన్నాయి

అనుకోండి, నా దగ్గర 170 రూపాయలే ఉన్నాయి ఆ చీర ఇవ్వండి అంటే ఆ షాపువాడు మీకు చీర ఇస్తాడా? వాడు చీర ఇవ్వడు. అదేవిధంగా మీలో ఉన్న ఎన్ని దోషాలను మీరు జయించుకొంటూ వస్తున్నప్పటికీ ఆఖరుకు ఏదో ఒక చిన్న దోషం మిగిలి ఉన్నా మీకు భగవదనుభవం కలుగకుండా అది అడ్డువస్తుంది. 170 రూపాయలు మీ దగ్గర ఉన్నాయి కానీ ఒక అయిదు రూపాయలు ఆ చీర మీ చేతికి రాకుండా ఆపు చేసాయి. అలాగే మనకు నూటికి తొంభై తొమ్మిది సుగుణాలు ఉన్నాయి. ఒక్కటే దుర్గుణం ఉంది. నిన్ను నరకానికి మోసుకొనిపోవటానికి ఆ ఒక్క దుర్గుణం చాలు. నాలో ఒక చిన్న దోషం ఉన్నా ఈశ్వరుడు తన స్వరూపాన్ని నాకు ప్రసాదించడు. ఈశ్వరుడు తన స్వరూపాన్ని నాకు ప్రసాదించడు అనుకోండి ఇంక నాకు జ్ఞానం కలుగదు. ఈ ఒక్కమాట జ్ఞాపకం ఉంచుకోండి.

# మధుర వాక్యములు

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి)**

**సేకరణ : శ్రీమతి నాగలక్ష్మి, హైదరాబాద్**

ఆధ్యాత్మిక ప్రయాణానికి ఫౌండేషన్ చాలా ముఖ్యం. మనకు లోకజ్వరం తీవ్రంగా ఉంది. లోకజ్వరం తగ్గించడానికే భగవంతుడు మనకు సత్సంగం పెట్టాడు. మట్టిని బాగుచేసి కుండను తయారుచెయ్యటానికి కుమ్మరి ఎంతగా శ్రమిస్తాడో అలా మనలను పవిత్రం చేయటానికి సత్పురుషుడు అంతగా కష్టపడతాడు. సజ్జనసాంగత్యం, సత్సంగం ఇవి రెండూ మనలో ఉన్న లోకజ్వరాన్ని తగ్గించి, భగవంతుడిని పొందాలి అనే తపనను మనకు కలుగజేస్తాయి. మనలో ఉన్న వాసనలకు, కోరికలకు, అలవాట్లకు సజ్జనసాంగత్యం ఒక విరుగుడుగా పనిచేస్తుంది. మనకు కష్టపడి అభ్యాసం చేయటం వలన విద్య వస్తుంది, తపస్సు వలన కూడా విద్య వస్తుంది. కాళిదాసుకు, వాల్మీకికి తపస్సు వలన విద్య వచ్చింది. నారదుడు శూద్రుల ఇంటిలో పుట్టిన మంచిమాటలు విని విని దేవర్షి అయిపోయాడు. భగవంతుడి నామం కడుగలేని దోషాలు అంటూ ఈ భూమి మీద ఏమీ లేవు. అయితే ఆయన నామం పట్ల మనకు పరిమితులు లేని ఇష్టం, పరిపూర్ణమైన విశ్వాసం ఉండాలి.

నాన్నగారు కొత్తగూడెంలో ఒక కథ చెప్పారు. ఒక దెయ్యం గురువుగారివద్దకు వచ్చి మీరు ఏదైనా చెప్పండి చేస్తాను కానీ మీరు అలా చెప్తూనే ఉండాలి అంది. మొదట గురువుగారు దానికి ఆ పనులు, ఈ పనులు ఏవో చెప్పారు. చెప్పినదల్లా అది వెంటనే చేసేసి తరువాత ఏమిటో చేప్తారా లేక మిమ్మల్ని మింగేయనా అంటోంది. ఇంక గురువు దీనితో లాభం లేదు అనుకొన్నాడు. అప్పుడు ఒక పొడుగాటి గుంజను పాతి దానికింద నుంచి గుంజపైకి ఎక్కు, పైకి ఎక్కిన తరువాత మరల కిందకు దిగు, మరల పైకి ఎక్కు

ఇలా చేస్తూ ఉండు అని చెప్పాడు. దేహాత్మబుద్ధిని మించిన దెయ్యం అంటూ ఇంకోటి లేదు. దానిని విడిచిపెట్టటంకంటే మించిన సాధన లేదు. దానిని విడిచిపెట్టటానికి ప్రయత్నం చేయుటం మానేసి మనం చేసే పనులు ఇలాగే ఉంటాయి. మనం చేసే సేవలు ఇలాగే ఉంటాయి. సేవ అనే పదం నాకు నచ్చటంలేదు. మనకు మనం అన్నం తిని సేవ అనుకోము, అదే ఇతరులకు పెడితే సేవ అంటున్నాము. ఆ బుద్ధినే కదా మీరు తొలగించుకోవాలి. స్వ-పర బుద్ధి అది మూలంలో పుట్టిన పురుగు. చెట్టు వేరుకు పురుగుపడితే ఇంక ఆ చెట్టుకు రేణింపు ఉండదు. అలాగే ఈ బుద్ధిని ఉంచుకొని మనం ఎన్ని చేసినా పవిత్రులం అవ్వము. మన చేతులు గురువుకోసం ఏమీ చేయలేకపోవచ్చు. కానీ మనం గురువును స్మరించుకొంటూ, ఆయన మాటలను ఆయన ఆప్యాయతను తలపెట్టుకొంటూ ఆయన పట్ల కృతజ్ఞతతో మన హృదయం నిండినప్పుడు మన కంటి నుండి వచ్చిన ఒక్క కన్నీటి బొట్టు గంగాజలం కంటే పవిత్రమైనది. వాల్మీకి ఏమన్నాడు అంటే కృతజ్ఞతలేని మనిషి శరీరాన్ని విడిచిపెడితే మాంసం ఇష్టంగా తినే జంతువులు కూడా వాడి దేహాన్ని ముట్టుకోవు, అంత హేయమైనది వాడి జీవితం అని చెప్పాడు.

బెర్నాడ్‌షా అని ఒక ఇంగ్లీషు రచయిత మేన్-సూపర్‌మేన్ అనే ఒక డ్రామా వ్రాసాడు. మనిషి శరీరముతో, మనస్సుతో, మాటలతో కర్మలను చేస్తూ ఉంటాడు. వీటి వద్ద మనం బహుజాగ్రత్తగా ఉండాలి, ఇవే మనలను జన్మలకు కట్టేస్తున్నాయి. మనం ఏ స్థాయిలో పుట్టిన సూపర్‌మేన్‌గా ఎదగాలి. అంటే మనం శరీరముతో స్వార్థరహితమైన పనులు చేస్తూ, మనస్సులో ఉన్న కామాన్ని పిండేసి ప్రేమను, అనురాగాన్ని నింపుకొని, మాటలో ఉన్న హింసాప్రవృత్తిని విడిచిపెట్టి అహింసాప్రవృత్తితో ఎవడైతే జీవిస్తున్నాడో వాడు సూపర్‌మేన్ అని చెప్పాడు. మనం ఆధ్యాత్మికంగా ఎదగాలంటే వివేకము, వైరాగ్యములను విడిచిపెట్టకూడదు. వివేకము నా తండ్రి, వైరాగ్యము నా తల్లి అని చెప్పాడు. ఏది తినాలి, ఏది తినకూడదు; ఏ మాటలు మాట్లాడాలి, ఏ మాటలు మన నోటి నుండి రాకూడదు; ఎవరితో సహవాసం చెయ్యాలి, ఎవరికి దూరంగా ఉండాలి; ఏ గ్రంథాలు చదవాలి, వేటిని ప్రక్కన పెట్టాలి అనేది మన వివేకమే మనకు చెపుతుంది. అదే మన తండ్రి. చంటి బిడ్డ ఎన్ని చూపించినా, ఎంతమంది పిలిచినా తల్లిని విడిచిపెట్టి ఎలా వెళ్ళడో అలాగే నీ హృదయంలో ఉన్న భగవంతుడిని విడిచిపెట్టి నీ త్రికరణాలు బయటకు వెళ్ళకుండా ఉండటమే వైరాగ్యము, అదే నా తల్లి అన్నాడు బెర్నాడ్‌షా.

రామకృష్ణుడి దగ్గరకు మధురబాబు అనే సంపన్నుడు వస్తూ ఉండేవాడు. సంపద లేని వాడికంటే సంపద ఉన్న వాడికి ఎక్కువ వైరాగ్యం ఉండాలి లేకపోతే ఆ సంపద వల్లే

వాడు పాడైపోతాడు. మధురబాబుతో రామకృష్ణుడు ఏమన్నాడు అంటే మధురబాబు నేను నిన్ను ప్రేమిస్తున్నాను. ఎలా ప్రేమిస్తున్నాను అనుకొంటున్నావు? నీ లోపల ఉన్న బలహీనతలను కలుపుకొనే ప్రేమిస్తున్నాను అన్నాడు. గురువు మనలోని బలహీనతలను ఎంచటం మొదలు పెడితే ఒక్కడు కూడా మిగలడు. నీ బలహీనతలు తెలియక అమాయకంగా ప్రేమిస్తున్నాను అనుకొంటున్నావా? కాదు. నీ బలహీనతలు నాకు తెలుసు వాటిని కలుపుకునే నిన్ను ప్రేమిస్తున్నాను. ఎందుకో చెప్పమంటావా? నీ బలహీనతలను, అలవాట్లను సాటిస్ఫై చేసుకొంటూ అందులోనుండి ఎంతోకొంత దుఃఖమిశ్రితమైన ఆనందాన్ని అనుభవిస్తున్నావు. నా ప్రేమలో, నా ఆప్యాయతలో బాహ్యప్రపంచానికి సంబంధించిన నలకలు లేవు. నా ప్రేమలో ఉన్న మాధుర్యాన్ని, నా ఆప్యాయతలో ఉన్న డివైన్‌టచ్‌ని నువ్వు అనుభవించి అయినా నీలోని బలహీనతలను విడిచిపెట్టేస్తావు అని నిన్ను ప్రేమిస్తున్నాను మధురబాబు అన్నారు. అది గురువు యొక్క ప్రేమ. డివైన్‌లవ్. దానికి మరణం లేదు. శరీరం ఉన్నా అది శరీరానికి సంబంధించినది కాదు. అది ఎప్పటికీ సజీవంగానే ఉంటుంది. ఆయనపట్ల విశ్వాసం, ఆయన వాక్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండాలి. అవి మాటలు కాదు, జ్ఞానదీపాలు. ఆ వెలుగులో జీవించటమే మన కర్తవ్యం. గురువు యొక్క స్మరణను మనం ఎప్పుడైతే విడిచి పెట్టేసామో అప్పుడు లోకవిషయాలు మనలను పట్టుకొంటాయి. అప్పుడు జీవుడు ఆపదలో పడతాడు, వాడి పతనం ప్రారంభమవుతుంది. గురువు హృదయాన్ని చీల్చుకొని మానవాళి పట్ల అనుగ్రహంతో వచ్చిన బోధ జ్ఞానదీపమై మన హృదయంలో ఉన్న జ్ఞానామృతం మనకు అందేవరకు మనం ఎక్కడ ఉన్నా కూడా అది మనలను వెంటాడుతూనే ఉంటుంది. అదే జీవుడికి సంపద.

తుకారామ్‌ను సమాజం అవహేళనగా చూసింది కానీ వాడికోసం పుష్పక విమానం వచ్చింది. భక్తుడికి కావలసింది లోకానికి సంబంధించిన వ్యక్తుల యొక్క మెప్పులుకాదు, దైవానుగ్రహం ఉండాలి. ఒక్క గురువు అనుగ్రహం మనకు ఉంటే జీవితంలో మనకు ఏమీ లేకపోయినా మనం అన్నీ ఉన్నవాడితో సమానం. గురువు అనుగ్రహం లేనప్పుడు మనకు జీవితంలో అన్నీ ఉన్నా ఏమీ లేనివాడితో సమానం. ప్రారబ్ధంలో ఏ కెరటం ఎప్పుడు రావాలో అప్పుడు వస్తుంది. అది ఎలా వచ్చిందో అలాగే పోతుంది కానీ నువ్వు మాత్రం క్వయిట్‌గా ఉండు, కామ్‌గా ఉండు, కూల్‌గా ఉండు, దాని పని అది చేసుకొని పోతుంది. నీవు స్మరణను విడిచిపెట్టవద్దు అది నీకు తెలియకుండానే నిన్ను జ్ఞానమనే ఒడ్డుకు తీసుకొని పోతుంది. ఇదేమిటి మనం అప్పుడే ఒడ్డుకు వచ్చేసాము, ప్రయాణం చేసినట్లే లేదు అని నీకు అనిపిస్తుంది. తుకారామ్ ఏమన్నాడు అంటే రంగా, పాండురంగా! జీవకోటి అంతా

ఈ నేనును విడిచిపెట్టటానికి నానా తంటాలు పడుతున్నారు. ఆ నేను ఎప్పుడు పోయిందో, ఎలా పోయిందో, ఎక్కడ పోయిందో పత్తా లేకుండా పోయింది, ఎంత వెదికినా కనబడటం లేదు అంటాడు తుకారామ్. మన బట్టల మీద ఏదైనా ఈగలు, పురుగులు వాలితే వెంటనే కొట్టేస్తాము. అలాగే రామకృష్ణుడు అంతఃకరణంలో ఏదైనా ఒక్క చెడ్డ తలంపు వస్తే వెంటనే అమ్మ దగ్గరకు పరుగున వెళ్ళి అమ్మతో చెప్పకొని ఏడ్చేవాడు. అది ప్యూరిటీ పట్ల ఆయనకు ఉన్న ఆప్యాయత. మన శరీరంలో ఉన్న రక్తాన్ని అంతటినీ ధారపోసిన మనం గురువు యొక్క ఋణం తీర్చుకోలేము.

ఆచార్యులవారు కాలి నడకన మూడుసార్లు భారతదేశం అంతా తిరిగి జ్ఞానబోధ చేసారు. ఆయన జ్ఞానబోధతో మన మనస్సుకు ఉన్న కదలికలను ఆపుచేసి కెరటాలు లేని సముద్రంలా చేసారు. ఆయన సాంగత్యంలో, ఆయన జ్ఞానబోధలో మనలో ఉన్న వాసనలు పూర్తిగా కాలిపోతే అప్పడు అంతటా ఉన్న బ్రహ్మంలో ఐక్యమవుతాము. ఒక చిన్న మర్రివిత్తనంలో ఎంత వృక్షం దాగి ఉందో అలా ఒక్క వాసనలో అనేక జన్మ పరంపరలు దాగి ఉన్నాయి. ఎవరైతే శేషం లేకుండా వాసనాక్షయం పొందుతారో వారు ఆ శరీరంలో మరణించి మరల అదే శరీరంలో ఉదయిస్తారు. అది అపూర్వం, అది అద్భుతం. అప్పడు వారి దేహం దేవాలయం అవుతుంది. ఆ నేత్రాలు జ్ఞానజ్యోతులు, ఆ చేతులు చేసే పని పవిత్రం, ఆయన మాట జ్ఞానానికి దారి చూపిస్తుంది. అట్టి మహనీయుని సాంగత్యం వలన మన హృదయద్వారాలు తెరువ బడతాయి. అటువంటి ఉత్తములు, అటువంటి మహాత్ములు, అటువంటి పవిత్రులు ఈ భూమి మీద దేహం ధరించి ఉండటం భూమికి వెలుగు. వారు శరీరం విడిచిపెట్టినా వారి సన్నిధి నుండి జీవకోటికి వారి అనుగ్రహం అందుతూ ఉంటుంది. ఆయన దయ అనే ప్రవాహంలో మనలను మనం సంస్కరించుకోవాలి, పవిత్రం చేసుకోవాలి, జ్ఞానసంపదనే గమ్యంగా పెట్టుకొని జీవించాలి అనే ఎరుకను మనకు సదా అనుగ్రహిస్తూ ఉంటారు. సద్గురు శ్రీనాన్నగారి గురించి నేను ఒకమాట చెపుతున్నాను ఇప్పడు ఆయన దేహం మనకు కనిపించక పోవచ్చు. ఆ నేత్రాలు మనకు కనిపించకపోవచ్చు కానీ ఆ నేత్రాలు మన పట్ల కురిపించిన అపారమైన కరుణ, ఆ నోరు ఇప్పడు మనకు కనిపించకపోవచ్చు కానీ ఆ నోటి నుండి వచ్చిన దయాపూరితమైన పలకరింపు, దైవత్వంతో నిండిన ఆ అభయహస్తముల స్పర్శ తరతమ బేధం లేకుండా ప్రతి భక్తుల యొక్క యోగక్షేమములు సదా కోరినటువంటి ఆ హృదయం దానికి మరణం లేదు. సద్బుద్ధి ఉన్న ప్రతి భక్తునికి అది ఆశ్రయం. దేహముతో పని లేకుండా అనుగ్రహించే శక్తి ఆ హృదయానికి ఉంది. కాశీలో గంగ మన దోషాలను హరిస్తుంది, అరుణాచలంలో గిరి మన అజ్ఞానాన్ని హరిస్తుంది, జిన్నూరులో ఉన్న సన్నిధి మనలను హృదయంలో మేల్కొలుపుతుంది.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

## ఏకచింతన

భగవాన్ శ్రీ రమణమహర్షి ఏకచింతన చెయ్యమంటారు. ఏకచింతన అనగా అనన్యచింతన, అభేదచింతన. సకలమునకు ఆధారము, అనంతము, సర్వవ్యాపకము, అయిన ఆత్మను అనన్యముగా అనగా, అదే నేనుగా చింతించాలి. మన నిజస్థితి కేవల ఉనికి, శుద్ధజ్ఞానం. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు యొక్క భిన్నత్వం ఆత్మజ్ఞానము చేత నశిస్తుంది. ఏకచింతన చెయ్యాలంటే సాధకులకు పవిత్రత, ఏకాగ్రత, ఎంతోకొంత ఏకాంతవాసము అవసరము. దీనికి భగవాన్ చక్కటి ఉపమానము చెప్పినారు. మనము ఒక చిన్న మొక్కను నాటినప్పుడు, దానికి కంచెవేసి, ప్రతిరోజు చక్కగా నీరుపోసి, ఎరువులు వేసి, దానిని శ్రద్ధగా సంరక్షిస్తాము. కంచె వేయనిచో ఆ మొక్క చిన్నదిగా ఉన్నప్పడే ఏ జంతువో తినివేయును. నీరు పోయనియెడల ఎండిపోతుంది. ఎరువు వేయనిచో బలముగా ఎదగజాలదు. కావున ఆ మొక్కపట్ల తగిన శ్రద్ధను, జాగ్రత్తను మనము తీసుకుంటాము. అట్లే సాధకునికి ఏకాంతవాసము మొక్కకు కంచెవంటిది. ఏకాంతవాసము అంటే కేవలము మనుష్యులులేని చోటు అని కాదు దాని అర్థం. వాసనల నుండి విముక్తి పొంది ఆత్మనిష్టలో ఉండుటయే నిజమైన ఏకాంతవాసం. ఏకాంతం అనేది భౌతికము కాదు. మనలోని తలంపులు, కోరికలు, వికారాలు, ఉద్రేకాల నుండి విడుదల పొందడం. మనకు సాధనాబలం తక్కువగాను, వాసనాబలం ఎక్కువగాను ఉంది. కాబట్టి సాధనాబలం ద్వారా, వాసనాబలాన్ని తగ్గించుకోవాలి. ప్రతి దినము క్రమాభ్యాసము మొక్కకు నీరుపోయుట వంటిది. శ్రద్ధ, తపన, పట్టుదల, శ్రవణ, మననాదులు, మొక్కకు ఎరువు వంటివి. వీటిని చక్కగా ఆచరించినప్పడే సాధకుడు 'తానే' అయిన బ్రహ్మముతో అభేదత్వమును సాధింపగలడు. దేహము జీవించి యుండగానే, గుర్వనుగ్రహము వలన, దేహాత్మబుద్ధినుండి విడుదల పొందితే, జీవుడు, జగత్తు, ఈశ్వరుడు, ఏకవస్తువే అవుతారు.

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# నామ జపంలోనే శరణాగతి ఇమిడి ఉంది

శరణాగతి అంటే 'నేను' లేకపోవటం. నేను అనే భావనను పూర్తిగా తొలగించుట, సర్వకాల సర్వ అవస్థలయందు పరమాత్ముడైన గురువు పైనే ఆధారపడి ఆయనతో అనుబంధం కలిగి భక్తితో జీవించటం. నిజమైన ఆధ్యాత్మిక జీవితం ఇటు ఆత్మపరిశీలన, ఆత్మవిమర్శ, పశ్చాత్తాపాలతో ప్రారంభమౌతాయి. రోగికి ఎంతరోగం ఉందో గుర్తిస్తేనే వైద్యుణ్ణి విశ్వాసంతో ఆశ్రయించగలడు. భూమి యొక్క స్వభావం తెలిసాకే అది ఏ పంటకు అనుకూలమో తెలుసుకొని సాగు చేస్తే సస్యశ్యామల మౌతుంది. అందుకనే వేదకాలం నుంచి అన్ని సత్కర్మలకు ప్రారంభంలో ప్రాయశ్చిత్తమనే క్రతువు చెయ్యటం ఆచారమైనది. మన పాపాల గురించి నిజమైన పరితాపం చెందాలి. మనలో దుర్గుణాలను తొలగించుకోవాలి. మన దుఃఖ స్వభావానికి హృదయపూర్వకంగా దుఃఖించాలి అప్పడే మనం ఉద్ధరించుకోవాలనే నిజమైన తపన ప్రారంభమౌతుంది. అప్పడే మనం గురువుకు శరణాగతి పొందుతాము. వాక్కు ఇచ్చినందుకు వేయిసార్లు అయినా ఈశ్వర నామం చెయ్యాలి. వ్యర్థ ప్రసంగాల వల్ల పాపం, దానివల్ల కలిగే ఉపద్రవం భగవాన్ నామంతో తొలగిపోతుంది. శంకరాచార్యులు "ఏమీ తెలియకపోయినా గోవిందా, గోవిందా అని పలుకు" అని ఆదేశించారు. భోజన సమయంలో మౌనంగా గోవింద నామస్మరణ చెయ్యటం వల్ల అది శరీరంలో ప్రవేశించి, అది పరమాత్మ ధ్యానానికి దోహదం చేస్తుంది. ఆ అన్నసారం దేహంలోనికి మరుపు ఏర్పడదు. భగవంతునిపై ప్రేమలో కొన్ని సందర్భాలలో ఉద్వేగం అనుసరిస్తుంది. ఒక్కొక్కసారి ఏడుపు స్థితిలో ఉంటాము. అది స్వభావికంగా వస్తున్నప్పడు దాన్ని అనుసరించవచ్చు. అది హాని చెయ్యదు. శ్రీనాన్నగారు "నామంలో ఏముంది అనుకోకండి. విత్తనం చిన్నదైనా పెద్ద వృక్షమౌతుంది. దాని నీడలో మీరు చల్లగా ఉండవచ్చును. మీరు ఇతరుల నీడలో ఉండనక్కరలేదు. ఆ నీడలోనే ఉండి చాలా మంది సుఖపడ్డారు" అన్నారు. అన్నమయ "నామం వెల సులభము, ఫలమధికము" అన్నారు. ముక్తికి అరణ్యాలు ఏకాంతములే సాధనా మార్గాలు అని అనుకోకుండా మన ఇంట్లో వారి యొక్క, స్నేహితుల యొక్క, ప్రాపంచిక మనుషుల యొక్క తిట్లు, ఛీత్కారాలు, దూషణలు ఓర్చుకోవటమే నిజమైన తపస్సు. దాన్ని భగవదేచ్ఛలో అణకువతో జీవించటం కూడా తపస్సే. పరమేశ్వరుడు మనకు నాలుక ఇచ్చిన ఫలంగా శివా, శివా అని జపించటమే. పరమేశ్వరుని ముఖాముఖి చూడవలసిన పనిలేదు. ఆయన నామం ఒక్కటే చాలు. పాప పరిహారానికి శివనామానికి మించిన సులభోపాయం మరొకటిలేదు. నామజపం మన జీవితంలో ఎన్ని గంటలు, ఎన్ని నిమిషాలు లభిస్తుందో అది మన ఆయుష్షులో ఆ భాగమే సార్థకమైనది. మనకు అనవసరపు మాటలు తలంపులు ఎక్కువగా వస్తాయి. ప్రకృతి విషయాల చింతన వల్ల ఉద్రేకం తాపమో, కామమో కలుగుతాయి, అందరికీ కటుంబ భారం ఉంటుంది. ఉద్యోగాలు నిర్వహించాలి ఎన్నో విషయాలు ఆలోచించాలి ఆ అవసరం ఉంది. అయితే అ'ట ఎంత వరకూ ఉండాలో ఎంతవరకూ చెయ్యాలో అంతవరకూ చేసి మిగిలిన అవకాశాన్ని భగవత్ స్మరణతో గడపాలి. అదే సాఫల్య మార్గం.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**